క్లుప్తంగా

తీర ప్రాంతాల్లో సందడి



తిక్కవానిపాలెం తీరంలో జలకాలడుతున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ఉదయాన్నే సందర్శకులు తీర ప్రాంతాలకు చేరి వెంట తెచ్చుకున్న ఆల్పాహారాన్ని భుజించి జెట్టీ కింద సేదతీరారు. ఇసుక తిన్నెలపై ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం తీరంలో జలకాలటలతో ఉత్సాహంగా గడిపారు.

అప్పన్నను దర్శించుకున్న పశ్చిమ బెంగాల్ ప్రిన్సిపల్ సెక్రటరీ



ప్రిన్సిపల్ సెక్రటరీకి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నారాయణ్ స్వరూప్ నిగమ్ దర్శించుకునారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: జీవీఎంసీ పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. 97వ వార్డులోని వెంకటాద్రినగర్ కాలనీ, టీచర్స్ లే అవుట్, భాస్కర్‌రెడ్డి లే అవుట్, వీరానగర్ కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల్లో సమస్యలను వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత ఎమ్మెల్యేకు వివరించారు. ఆయా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులకు పంచకర్ల ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హైమావతి, నాయకులు శానాపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ ముమ్మన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు వరలక్ష్మీనగర్‌లో కొలువుదీరిన మరిడిమాంబ (పశువుల మ్మతల్లి) పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పసుపు–కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మొక్కలు నాటిన సత్యసాయి భక్తులు

ఉక్కునగరం: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో పలుప్రాంతాల్లో మొక్కలు నాటారు. సత్యసాయి జయంతి సందర్భంగా జాతీయస్థాయిలో 'ప్రేమ తరు' పేరిట కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ వాటర్ మేనేజ్‌మెంట్ విభాగం డీజీఎం, ఎస్టీ.బి.ఎల్ వాస్తవ్యులు పి. సురేష్ ఆర్థిక సాయంతో 108 జాతి మామిడి మొక్కలు నాటారు. సత్యసాయి సేవా సమితి సభ్యులతో సురేష్, ఎస్టీ.బి.ఎల్ కాలనీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.

రోడ్డు తవ్వేయడం కక్ష సాధింపే..

- రైతులను అడ్డుకోవడం సమంజసం కాదు
- వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్
- రైతులతో కలిసి గెడ్డపోరంబోకు స్థలం పరిశీలన



మాట్లాడుతున్న గండి రవికుమార్



పొక్లెయిన్ సాయంతో తొలగించిన రోడ్డును రైతులు, గ్రామ పెద్దలతో కలిసి పరిశీలిస్తున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని నారపాడు పంచాయతీ పరిధి బలిజపాలెంలో గెడ్డ పోరంబోకులో ఉన్న రోడ్డు తొలగించి ఆక్రమణకు పాల్పడడం వివాదంగా మారింది. దీంతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ మిగిలిన పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష సాధింపు చర్యలకు బలిజపాలెం నుంచే శ్రీకారం చుట్టారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యగానే భావిస్తున్నామన్నారు. మూడేళ్ల కిందట ఈ గ్రామంలో అప్పటి ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారుల సహకారంతో రైతుల కళ్లాలు, పశువుల పాకలకు వెళ్లేందుకు సర్వే నెంబర్ 161, 162లలో గెడ్డను ఆనుకొని గెడ్డ పోరంబోకులో రోడ్డు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించారన్నారు. నాటి నుంచి కళ్లాలకు వెళ్లేందుకు రైతులంతా వినియోగించుకొనే రోడ్డును ప్రస్తుతం జనసేన, టీడీపీ ప్రోద్బలంతో గెడ్డవాగును ఆనుకొని సాగుచేస్తున్న రైతు రోడ్డును పొక్లెయిన్‌తో తొలగించి ఆక్రమణకు పాల్పడడం దారుణమన్నారు. ఈ విషయంపై మిగిలిన రైతులతో కలిసి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి కొండాజీ,సేనాపతి దుర్గారావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. రైతులు వినియోగించేకొనే రోడ్డును తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకొని రోడ్డును యధావిధిగా ఏర్పాటు చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.

మాటలకు.. పొంతనకు తేడా

కూటమి పెద్దలు కక్ష సాధింపులకు పోవద్దంటూ పైకి చేస్తున్న ప్రకటనలకు,క్షేత్ర స్థాయిలో జరుగుతున్న కవ్వింపు చర్యలకు పొంతన లేకుండా పోతుందని విమర్శించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు రైతుల విషయంలో రాజకీయాలను ప్రోత్సహిస్తూ మద్దతివ్వడం సరికాదన్నారు. స్థలాన్ని పరిశీలించినవారిలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఐడీ బాబు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, నాయకులు తాసుబిల్లి కనకరాజు,సేనాపతి దుర్గారావు,దేముడు,టి. ఈశ్వరరావు,శ్రీను,గణేష్,కాసు,మామిడి రాము,తుంపాల అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

230 మంది రక్తదానం

సింహాచలం: అడవివరానికి చెందిన నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహా రక్తదాన శిబిరానికి విశేషంగా స్పందన లభించింది. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన శిబిరంలో 230 మంది దాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. రోటరీబ్లడ్ సెంటర్, వందే భారత్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కర రావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి సత్తిబాబు తదితరులు రక్తదాన శిబిరంలో పాల్గొని దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. నవయువ సేవా సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'మొల్ల రామాయణం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: విశాఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య కోలవెన్ను మలయవాసిని రచించిన, తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముద్రించిన మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్య గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో జరిగింది. డాక్టర్ ఈదర పెద వీర్రాజు చేతుల మీదుగా ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడిన ఎందరో కవుల్లో మొల్ల కూడా ఒకరని, ఆమె ఒక మహిళై ఉండి కూడా ఆనాటి పురుషాధిక్య సమాజంలో రామాయణాన్ని రచించడం సాహసోపేతమైన చర్యని కొనియాడారు. గ్రంథ రచయిత కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ మహిళల్లో మొట్టమొదటి రచయిత్రిగా మొల్ల రామాయణాన్ని రచించారని, ఇటువంటి గ్రంథానికి వ్యాఖ్యాన గ్రంథం ఉండాలనే సంకల్పంతో ఈ రచనకు పూనుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, డి.వి.సూర్యారావు, శంకర్ నీలు భాగవతుల సభ్యులు గండికోట విశ్వనాధం, అన్నవరపు శ్రీనివాసరావు, సాయిబాల, ఎ.వి.జోగారావు, సిహెచ్.సూర్యనారాయణ, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

పాత నేరస్తులకు ఈస్ట్ క్రైం ఏసీపీ హెచ్చరిక



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న క్రైం ఏసీపీ వెంకటరావు, సీఐ రమేష్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేసన్ ఆవరణలో ఆదివారం పాత నేరస్తులకు ఈస్ట్ క్రైం ఏసీపీ వెంకటరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుల దినచర్య, సత్ప్రవర్తనతో ఉంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు ఉన్న వారి వివరాలను సేకరించారు. తగాదాలు, గొడవల్లో తలదూర్చకుండా ఉండాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాల జోలికి పోకూడదన్నారు. సమాజంలో ఎటువంటి నేరాలకు పాల్పడినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు చేసే పనులపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని చెప్పారు. రాత్రిళ్లు తిరిగినట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చెడు మార్గాన్ని విడనాడి మంచిగా నడుచుకోవాలని ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో ద్వారకా జోన్ సీఐ ఎస్.రమేష్, క్రైం ఎస్‌ఐలు భాస్కరరావు, రాజు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

- సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశం
- ఆరిలోవ పోలీస్ స్టేషన్ సందర్శన



ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సౌకర్యాలు, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆరిలోవ కాలనీ, హెల్త్ సిటీ పరిసరాలు, అపోలో ఆస్పత్రి వెనక భాగం తదితర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. నిర్మానుష్య ప్రాంతాలలో తరచూ పోలీస్ గస్తీ నిర్వహించాలని, ఖాళీ ప్రదేశాలలో తుప్పలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సీఐ గోవిందరావును ఆదేశించారు. గంజాయి వాడకంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌పై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు సహకరించే విధంగా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సీపీ ఆదేశించారు. గంజాయి క్రయ విక్రయాలతో పాటు గంజాయి వినియోగిస్తున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి నియంత్రణ కోసం రోజూ 15 మంది ఏఆర్ పోలీసుల బృందం ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయంత్రం సమయంలో తిరుగుతుందని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు పాదాలమ్మ, బంగారమ్మ పండగ

సింహాచలం: అడవివరం గోశాల లేఅవుట్‌లో కొలువుదీరిన ఉమామహేశ్వరి, పాదాలమ్మ, బంగారమ్మ పండగను మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. పండగను పురస్కరించుకుని ఆరోజు సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సిరిజ్యోతి పూజ



సిరిజ్యోతి పూజలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో వారాహి నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం అమ్మవారు సౌభాగ్య ఆభరణ ఆలంకరణధారియై భక్తులకు దర్శనమిచ్చారు. వాగీశ్వరీ సహిత వారాహి హోమం,అర్చనలు జరిగాయి.మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో గురుమాత అన్నపూర్ణమ్మ చేతులమీదుగా అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం శ్రీమేరు మొదటి అంతస్తులో ప్రతిష్ఠించి ఉత్సవ మూర్తి ఎదురుగా శ్రీవారాహి సిరిజ్యోతి పూజ నిర్వహించారు.

సాగరతీరంలో స్వచ్ఛత పక్వాడా



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారులు

బీచ్ రోడ్డు: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో ఆదివారం సాగర తీరంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తీరంలోని చెత్తా చెదారం సేకరించి జీవీఎంసీకి అప్పగించారు. అనంతరం ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు పరిశుభ్రతపై అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. వాక్‌థాను హెచ్‌పీసీఎల్ ఈడీ ఎస్.బాల దండయుతపాణి, డీజీఎం సి.మురళీకృష్ణ, పత్తి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హెచ్‌పీసీఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ స్పోర్ట్స్ మీట్ ట్రయల్స్ ప్రారంభం

ఆరిలోవ: ఏపీఎస్ ఆర్టీసీ జోన్–1 ఉద్యోగుల కోసం స్పోర్ట్స్ మీట్ ట్రయల్‌ను ఆదివారం జీవీఎంసీ 9వ వార్డు కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో నిర్వహించారు. ఈ స్పోర్ట్స్ మీట్ ట్రయల్స్‌ను ఏపీఎస్ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎ.అప్పలరాజు, బి.అప్పలనాయుడు, కె.వి.రావు, సత్యనారాయణ, సుధాబిందు పాల్గొన్నారు.

అలరించిన హాస్య నాటిక



హాస్య నాటికలోని ఓ సన్నివేశం

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన 'పుటుక్కు జర..జర.. డుబుక్కు మే' హాస్య నాటిక కడుపుబ్బా నవ్వించింది. పాత్రధారుల హాస్య ప్రదర్శన అలరించింది. ఎం.దివాకర్‌బాబు రచించిన ఈ నాటికకు పి.శివప్రసాద్ దర్శకత్వం వహించారు. మాచిరాజు నారాయణరావు నిర్వహణలో పి.ఎల్.వి.ప్రసాద్(ప్రసాదం), డి.వి.ఆర్ మూర్తి(రామనాథం), పి.చెల్వరాజు(కాశీపతి), ఎం.చంద్రరావు(వెంకుబాబు), ఈటి రాంబాబు(చాకలి), జి.మాధవీలత(జానకి) పాత్రధారులుగా నటించి మెప్పించారు. ఎస్.వి. రమణారావు(మేకప్), సత్యనారాయణ సంగీతం, టి.అప్పారావు రంగాలంకరణ చేశారు. ముందుగా పార్కులో నూతనంగా నిర్మించిన సభా ప్రాంగణాన్ని ప్రారంభించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఇతర సభ్యులు ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు

గిరిప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన



తొలిపావంచా వద్ద ట్రాఫిక్ నియంత్రణపై చర్చిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

సింహాచలం: గిరి ప్రదక్షిణ రోజు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టిసారించారు. దీనిలో భాగంగా భక్తులు బయలు దేరే కొండదిగువ శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి తొలిపావంచా వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలసి నార్త్ ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ ఆదివారం సాయత్రం పరిశీలించారు. భక్తులు తొలిపావంచా వద్దే కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణ ప్రారంభిస్తారు. దీంతో ఆప్రదేశంలో ఏర్పాటు చేయాల్సిన క్యూలు, భక్తుల మధ్య తోపులాటలు లేకుండా చేయాల్సిన ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కొబ్బరికాయలు కొట్టేందుకు ఎన్ని ర్యాంపులు వేయాలో పరిశీలన చేశారు. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన ప్రాంతాలను గుర్తించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- అప్పన్నస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

గుర్తింపు కార్డులు తప్పనిసరి

మార్కెటింగ్ అధికారి యాసిన్



స్టాల్స్‌ను తనిఖీ చేస్తున్న యాసిన్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతు బజారును వ్యవసాయ,వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ ఆదివారం పరిశీలించారు. రైతు బజారులో ఏర్పాటు చేసిన కందిపప్పు, రైస్ స్పెషల్ కౌంటర్‌ను పరిశీలించి విక్రయాలు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులు, దుకాణదారులతో మాట్లాడివారి సమస్యలు తెలుసుకున్నారు. దుకాణదారులంతా తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించేలా శ్రద్ధ తీసుకోవాలని రైతు బజార్ ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలుకు సూచించారు. వినియోగదారులకు కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు బజారులో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

300 మందికి వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

పరవాడ: స్థానిక శ్రీవెంకటేశ్వర డాక్టర్స్ ప్లాజాలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరవాడ పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన రోగులకు ప్రముఖ వైద్య నిపుణులు రమణమూర్తి, చిటికెల రమేష్‌బాబు, మరో పది మంది వైద్య బృందం 8 రకాల రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు జరిపి సేవలు అందించారు. మాజీ ఎంపీపీ పైల జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీఉపాధ్యక్షుడు కన్నూరి వెంకటరమణ, పి.బొనంగి మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు పాల్గొని వైద్య శిబిరం నిర్వాహకులను అభినందించారు. శిబిరంలో 300 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

పరమాత్ముని దయతోనే జీవన్ముక్తి



సంత్ సమాగంలో పాల్గొన్న మహిళలు



సందేశమిస్తున్న సద్గురు మాతా సుదీక్షా సత్య

డాబాగార్డెన్స్: పాతనగరంలో ఆదివారం సంత్ నిరంకారీ మిషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంత్ సమాగం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ జోనల్ ఇన్‌చార్జి మోహినీ అహూజా సందేశమిచ్చారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం నుంచే కాక తూర్పు, పశ్చిమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, సంత్ నిరంకారీ మిషన్ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాగంలో పలువురు మహిళలు లఘు నాటికలు, కవితలు, నృత్య గానాలు, బృందగానాలు, ఉపన్యాసాలిచ్చారు. అనంతరం సంత్ నిరంకారీ మిషన్ సద్గురు మాతా సుదీక్షా సత్య తెలుగు, హిందీ, మరాఠీ, ఒరియా, పంజాబీ, భోజ్ భాషల్లో ప్రసంగించారు. మానవ జీవిత లక్ష్యం, ప్రభు ప్రాప్తి, బ్రహ్మజ్ఞాన ఉపదేశాలకు సంబంధించి తెలిపారు. నేను ఎక్కడి నుంచి వచ్చాను.. ఎక్కడికి వెళ్లగలను అనే సత్యం గ్రహించి సద్గురు ద్వారా బ్రహ్మజ్ఞానం పొందాలన్నారు. పరమాత్మతో అనుసంధానమైన నామస్మరణ ద్వారా నిరంకారునితో యోగమై పరమాత్మునితో జీవించి జీవన ముక్తి పొందాలన్నారు. సంత్ సమాగంలో ప్రేమ్ రాంచంద్, పీవీ రావు, పీఎస్ఎన్ రాజు, రాజీవీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.